
ఆంధ్రప్రభ

బెజవాడలో ఘనంగా భట్టు మూర్తి విగ్రహావిష్కరణ







భట్టు మూర్తి విగ్రహావిష్కరణలో రాష్ట్ర భట్రాజు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ గీతాంజలి దేవి, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు

వందిగామ, ఫిబ్రవరి 18 (ప్రభ మ్యాప్): తెలుగు సాహిత్యాన్ని, తెలుగు భాష ఔన్నత్యాన్ని జగద్విఖ్యాతం చేసిన అష్టదిగ్గజ కవుల్లో ఒకరైన రామరాజ భూషణుడు (భట్టుమూర్తి) విగ్రహాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమని శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు కొనియాడారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో ఏర్పాటుచేసిన శ్రీకృష్ణదేవరాయలు ఆస్థాన కవుల్లో ఒకరైన శ్లేష కవితా చక్రవర్తి భట్టుమూర్తి విగ్రహాన్ని రాష్ట్ర భట్రాజు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి దేవి ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేలు వెల్లంపల్లి, మల్లాది మాట్లాడుతూ, వసు చరిత్ర, సరస భూపాలీయము, హరిశ్చంద్ర నలోపాఖ్యానము వంటి గ్రంథాలను రచించారని, వీటిలో వసు చరిత్ర అనేక భాషలలోనికి అనువదింపబడటం తెలుగు వారిగా మనందరికీ గర్వ కారణమన్నారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా భట్టుమూర్తి విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటుచేయడం గొప్ప విషయమన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన ఇటువంటి మహనీయుల చరిత్రలు భావితరాలు తెలుసుకునేందుకు వీలుగా విగ్రహాలు ఏర్పాటుచేయడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. అదేవిధంగా భట్టుమూర్తి గౌరవాన్ని నిలబెడుతూ నాలుగు దశాబ్దాలుగా రామరాజ భూషణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ను స్థాపించి 6 నుంచి పీజీ వరకు చదువుల్లో విశేషంగా రాణిస్తున్న భట్రాజ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులకు నేటి వరకు దాదాపు రూ.30 లక్షలను ఉపకార వేతనాలు రూపంలో అందించడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. కరోనా వంటి కష్టసమయంలో ఈ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు రూ.5 వేల వంతున ఆర్థిక సాయమందించడం, బుక్కరాజు ముక్కంటి రాజు స్మారక అవార్డును ప్రతి ఏటా పలు రంగాల్లో రాణిస్తున్న వారికి అందించడం వంటి చర్యలు అందరికీ అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్, రామరాజ భూషణ ట్రస్ట్ చైర్మన్ పి.జయప్రకాష్‌రాజు, కోశాధికారి భట్టు మనోహర్‌కుమార్, రాజా శ్రీధర్, ఎల్.అనసూయదేవి, ఎల్.శ్రీనివాసరాజు, పోరంకి శ్రీనివాసరాజుతోపాటు అధిక సంఖ్యలో భట్రాజులు పాల్గొన్నారు.

19/02/2024 | Vijayawada | Page : 3
Source : http://epaper.prabhanews.com/